న్యూస్‌రీల్

ఫుట్‌పాత్‌కు మరమ్మతులు



ఫుట్‌పాత్‌ను తొలగిస్తున్న ప్రొక్లైనర్

సాక్షి ఎఫెక్ట్..

భీమారం: మంచిర్యాల–చెన్నూరు జాతీయరహదారిలో భీమారం వద్ద ఫుట్‌పాత్ ధ్వంసం కాగా 'సాక్షి' దినపత్రికలో ఫుట్‌పాత్ ధ్వంసం అనే శీర్షికతో బుధవారం ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ప్రొక్లైనర్ ద్వారా ఫుట్‌పాత్‌ను తొలగించే పనులు చేపట్టారు. సమస్య పరిష్కరించేందుకు కృషి చేసిన 'సాక్షి'కి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

చెన్నూర్: పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో 2023–24విద్యా సంవత్సరం కోసం 5, 6, 7, 8తరగతుల్లో చేరేందుకు విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల 30వరకు గడువు ఉందని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఈ కింది ఫోన్ నంబర్ 7995057968కు సంప్రదించాలని కోరారు.

ముగిసిన బడిబయట పిల్లల సర్వే

దండేపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 6 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బడిబయట పిల్లల సర్వే దండేపల్లి మండంలో బుధవారం ముగిసింది. మండల విద్యావనరుల కేంద్రాల్లో పనిచేసే సీఆర్పీలు, ఐఈఆర్పీలు గ్రామాల్లో సర్వే చేపట్టి 6 నుంచి 14ఏళ్ల లోపు పిల్లలతో పాటు, 15 నుంచి 19 ఏళ్ల బడికి వెళ్లని పిల్లలను గుర్తించారు. 14ఏళ్ల లోపు పిల్లలను వయసుకు తగ్గ తరగతుల్లో చేర్పించగా, 15నుంచి 19ఏళ్ల వారిలో పది పాసైతే ఓపెన్ ఇంటర్, పది పాస్ కాని వారిని ఓపెన్ టెన్త్‌లో చేరేలా గుర్తించారు.

క్రీడా సామగ్రి అందజేత

భీమారం: మండలంలోని దాంపూర్ గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు సర్పంచ్ సంతోషం భాస్కర్‌రెడ్డి తన సొంత ఖర్చులతో బుధవారం క్రికెట్ కిట్లతో పాటు డ్రెస్‌లను పంపిణీ చేశారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఇందులో ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం కోటిరెడ్డితో పాటు కార్యదర్శి దేవేందర్ పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి సోనాపూర్ గ్రామ యువతకు బుధవారం కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా దేవాపూర్ ఎస్సై విజయేందర్ కిట్లు అందజేశారు. క్రీడల్లో రాణించి ఉన్నత స్థానంలో ఉండాలన్నారు. పోలీసు సిబ్బంది, యువకులు తదితరులు పాల్గొన్నారు.


తడి-పొడి చెత్తపై అవగాహన

మంచిర్యాలఅర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రార్థన సమయంలో పొడి, తడి చెత్త నిర్వహణ–మన బాధ్యత అంశంపై విద్యార్థులకు జిల్లా పర్యావరణ విద్య శిక్షకుడు యోగేశ్వర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్త బుట్టలను వేర్వేరుగా ఏర్పాటు చేసి ఆయా బుట్టలో చెత్తను విడదీసి వేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దుర్గయ్య, ఉపాధ్యాయులు వేణుగోపాల్, వర్మ, మహేశ్, గోలి మనోహర్, ఉదయ్, రాజమౌళి, రంగరాణి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాట	రూ.15
పచ్చిమిర్చి	40
చిక్కుడు కాయ	60
బీరకాయ	100
వంకాయ	60
కాకరకాయ	50
బెండకాయ	40
ఆలసంద	40
దొండకాయ	70
ములక్కాయ	120
సోరకాయ	30
క్యాబేజీ	30
క్యారెట్	60
తోటకూర	30
పాలకూర	40

- మంచిర్యాలఅగ్రికల్చర్



'కంటి వెలుగు'కు సర్వం సిద్ధం

బెల్లంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండో విడత కంటి వెలుగు వైద్య శిబిరాలను పురప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో బుధవారం పర్యటించి ఆయా వార్డుల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్వేత మాట్లాడుతూ.. పురప్రజలు ప్రతి ఒక్కరూ కంటి వెలుగు శిబిరాలకు వెళ్లి కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రజలందరికీ మంచి కంటి చూపును అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వైద్య శిబిరాల్లో అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా వార్డు కౌన్సిలర్లు సంగీత, లక్ష్మి, మున్సిపాల్ అధికారులు శ్రీనివాస్, భుజంగరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వెలుగు కేంద్రాలు ప్రారంభం

శ్రీరాంపూర్: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని మూడు కంటి వెలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్, సింగపూర్ పాత పంచాయతీ కార్యాలయం, నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను గురువారం ప్రారంభించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్‌తో కలిసి బుధవారం ఆయన ఆ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. శ్రీరాంపూర్ సీఈఆర్ క్లబ్‌లో వైద్య అధికారులు, కంటి వెలుగు సిబ్బందితో డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు సమీక్ష నిర్వహించారు.

జైపూర్: కంటి వెలుగును పకడ్బందీగా అమలు పర్చేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. జైపూర్ ఆస్పత్రిలో, బెజ్జాల గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం ఉదయం 9గంటలకు స్థానిక ప్రజాప్రతి నిధులు, అధికారులతో కలిసి ప్రారంభించనున్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గోదారి రమాదేవి, జెడ్పీటీసీ మేడి సునిత కోరారు.

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమానికి సంబంధించిన శిబిరాన్ని బుధవారం మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య పరిశీలించారు. పురపాలక సంఘం పరిధిలోని వార్డు నంబర్ 1లో, ఇటిక్యాలలోని ఎగ్గిడి గట్టయ్య ఇంటిలో 'కంటి వెలుగు' క్యాంపు నిర్వహిస్తున్నట్లు ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

చెన్నూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'కంటి వెలుగు'కు సర్వం సిద్ధం చేసినట్లు మున్సిపాల్ కమిషనర్ శ్రీనివాస్‌దేశ్‌పాండే, మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో గల బ్రాహ్మణ సేవ సంఘంలోని భవనంలో ఉదయం 10గంటలకు కంటి వెలుగును ప్రారంభించనున్నట్లు తెలిపారు.



బెల్లంపల్లి: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత



శ్రీరాంపూర్‌లో పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్



లక్సెట్టిపేట: సిబ్బందితో మాట్లాడుతున్న చైర్మన్

అసైన్డ్ భూములు కాపాడాలని వినతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలం పోచంపాడు శివారులోని సర్వే నెంబర్ 94లోని అసైన్డ్, సీలింగ్ భూములను అక్రమంగా పట్టా చేయించుకున్న వారిపై చర్యలు తీసుకుని ఆ భూములను కాపాడాలని కోరుతూ బీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ రాజలింగుకు వినతిపత్రం అందజేశారు. రామకృష్ణాపూర్‌కు చెందిన ఐలయ్య అనే వ్యక్తి నిరుపేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు లాక్కొని రెవెన్యూ అధికారుల సహాయంతో దొంగ పట్టా పాస్‌పుస్తకాలు సృష్టించి దాదాపు 40ఎకరాలకు గాను పాసుపుస్తకాలు కలిగి ఉన్నాడని తెలిపారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన ఐలయ్యతో పాటు అతడికి సహకరించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి వెంకటేశ్‌గుణ, జోనల్ మహిళా కన్వీనర్ భవాణి, మంచిర్యాల జిల్లా మహిళా కన్వీనర్ బొడ్డు వినోద పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ముగిసిన వాలీబాల్ టోర్నీ

దండేపల్లి: జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా దండేపల్లి మండలం మాదాపూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నాలుగు రోజుల క్రితం ప్రారంభమైన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. మొత్తం 28జట్లు పోటీల్లో పాల్గొనగా మొదటి బహుమతిని మాదాపూర్ జట్టు, రెండో బహుమతిని దండేపల్లి జట్టు గెలుచుకుంది. మొదటి బహుమతి కింద ట్రోఫీతో పాటు రూ.10వేల నగదు, ద్వితీయ బహుమతికి ట్రోఫీతో పాటు, రూ.5వేల నగదును అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, నాయకులు గాదె శ్రీనివాస్, ముస్కె కార్తీక్, సీపిరిశెట్టి శ్రీనివాస్, తాళ్లపెల్లి వంశీ, బత్తుల శేఖర్, పట్టి వెంకటకృష్ణ, కర్నాల కిషన్, బీడీ మల్లేష్, బోడ సత్యనారాయణ, బోర్లకుంట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న రఘునాథ్

ఎన్టీఆర్ వర్ధంతి



మంచిర్యాలలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సంజయ్‌కుమార్

బెల్లంపల్లి/మందమర్రిరూరల్/శ్రీరాంపూర్/రామకృష్ణాపూర్/మంచిర్యాలటౌన్: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 27వ వర్ధంతిని బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకున్నారు. టీడీపీ కార్యాలయాల్లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి పార్టీ శ్రేణులు నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల కోసం ఎన్టీఆర్ చేసిన సేవలను కొనియాడారు. బెల్లంపల్లిలో టీడీపీ సీనియర్ నాయకులు పున్నంచందర్, పట్టణ అధ్యక్షుడు సింహాద్రి, టీడీపీ అనుబంధ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.మాణిరామ్ సింగ్, ఉపాధ్యక్షుడు నారాయణ, జిల్లా కేంద్రం, రామకృష్ణాపూర్, మందమర్రిలో టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు సంజయ్‌కుమార్, శ్రీరాంపూర్‌లో మాజీ మంత్రి, ఆ పార్టీ నాయకుడు బోడ జనార్దన్, మాజీ ఎమ్మెల్యేలు శ్రీదేవి, సొత్కు సంజీవరావు, మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

శాలివాహన కార్మిక సంఘం కమిటీ

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాలలో గల శాలివాహన గ్రీన్ ఎనర్జీ పవర్ ప్లాంట్ కార్మిక సంఘం నూతన కమిటీని కంపెనీ ఆవరణలో బుధవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కుంటాల శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోగా, జనరల్ సెక్రటరీగా నిమ్మరాజుల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా సగుర్తి ఆనందరావు, కాయితి శ్రీనివాస్, కోశాధికారిగా దొడ్డిపెల్లి మల్లయ్య, కార్యవర్గ సభ్యులుగా రావుల తిరుపతి, అనుమల శ్రీనివాస్, పెంట సత్యం, ముఖ్య సలహాదారులుగా ఎడ్ల శ్రీనివాస్, బివి ప్రసాద్‌ను ఎన్నుకున్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

మందమర్రిరూరల్: మందమర్రిలోని జెడ్పీ చైర్‌పర్సన్ నివాసంలో మండల అభివృద్ధి అధికారుల సంఘం 2023సంవత్సర క్యాలెండర్, డైరీని బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలుతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో నరేందర్, డీఆర్‌డీవో శేషాద్రి, అడిషనల్ డీఆర్‌డీవో దత్తారావు, జిల్లాలోని ఎంపీడీవోలు వల్లంభట్ల ప్రవీణ్‌కుమార్, శశికళ తదితరులు ఉన్నారు.

సబ్సిడీ పెరటి కోళ్ల పంపిణీ



భీమారం: పంపిణీ చేస్తున్న రాకేశ్‌శర్మ, మల్లేశ్



దండేపల్లి: పెరటి కోళ్ల పంపిణీలో పశువైద్యాధికారి

దండేపల్లి: పెరటి కోళ్ల పెంపకంతో ఉపాధి పొందొచ్చని, మండల పశువైద్యాధికారి ధన్‌రాజ్, సర్పంచ్ చంద్రకళ అన్నారు. దండేపల్లిలో రాయితీపై వచ్చిన పెరటి కోళ్లను 12మంది లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేశారు. పెరటి కోళ్ల పెంపకంతో స్వయం ఉపాధితో పాటు లాభాలు సాధించవచ్చన్నారు. రాయితీలను వినియోగించుకుని, పెరటి కోళ్లను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్, ఉపసర్పంచ్ భూమన్న, లబ్ధిదారులు పాల్గొన్నారు.

భీమారం: మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన 9మందికి పశుసంవర్ధక శాఖ ద్వారా సబ్సిడీపై మంజూరైన పెరటి కోళ్ల యూనిట్లను బుధవారం మండల పశువైద్యాధికారి రాకేష్‌శర్మ, సర్పంచ్ మల్లేశ్ గ్రామస్తులకు పంపిణీ చేశారు.

జన్నారం: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో 75శాతం సబ్సిడీతో మొదటి విడతగా 15మందికి ఒక్కొక్కరికి 25కోడి పిల్లలను జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రాజేశ్‌యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేవైఎం రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ ఎన్నిక

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థుల స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయంబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో పోరాటం చేసేందుకు రాష్ట్ర శాఖ ప్రత్యేక కమిటీ కో ఆర్డినేటర్‌గా యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తులా ఆంజనేయులును ఎన్నుకున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, వినూత్న పోరాటాలతో ప్రభుత్వంపై ఒత్తిడి తేనున్నట్లు తెలిపారు.

బొగ్గుబాయి వార్తలు

29న ఎస్సీసీడబ్ల్యూ రాష్ట్ర మహాసభ

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు టి. శ్రీనివాస్
- విజయవంతం చేయాలని పిలుపు



మాట్లాడుతున్న శ్రీనివాస్

శ్రీరాంపూర్: ఈ నెల 29న సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఎస్సీసీడబ్ల్యూ) 7వ రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీనివాస్ తెలిపారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మాట్లాడారు. కొత్తగూడెంలోని ఉర్దూఘర్ షాదీఖానాలో ఈ సభ జరుగుతుందన్నారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్ట్ కార్మికులు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇందులో చర్చించి వాటి సాధన కోసం భవిష్యత్‌లో చేపట్టే ఉద్యమాలపై చర్చిస్తామని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 2003లో సంఘం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇన్నేళ్ల తమ పోరాటం ఫలితంగానే నేడు కాంట్రాక్ట్ కార్మికులకు బ్యాంక్ వేతనాలు, సీఎంపీఎఫ్ అమలు, కనీస వేతనాలు చట్టం అమలు జరుగుతుందని వివరించారు. మొదటి నుంచి ఏ మాత్రం ఉనికిలేని జాతీయ సంఘాల అనుబంధ కాంట్రాక్ట్ సంఘాలు నేడు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై పోరాడుతున్నట్లు ఫోజులిస్తున్నాయని విమర్శించారు. దేశవ్యాప్తంగా 2.5 లక్షల మంది కాంట్రాక్ట్ కార్మికులు బొగ్గు పరిశ్రమల్లో పనిచేస్తున్నారని తెలిపారు. వీరందరికి ఒకే రకమైన వేతనాలు అమలు చేయడం కోసం తాము ప్రతీ వేజ్ బోర్డు సమయంలో కొట్లాడుతున్నామన్నారు. జాతీయ సంఘాలు ఈవేతన ఒప్పందంలో కాంట్రాక్ట్ కార్మికులకు ఒకటో కేటగిరీ వేతనాలు సాధించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. కోలిండియాలో అమలు చేస్తున్న హైపవర్ కమిటీ వేతనాలు సైతం సింగరేణిలో అమలు చేయించకపోతున్నారన్నారు. మరో పక్క కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా నమ్మించి మోసం చేశారన్నారు. పోరాటాలతోనే హక్కులు సాధించుకుందామని తెలిపారు. సమావేశంలో ఎస్సీసీడబ్ల్యూ అధ్యక్షుడు డి.బ్రహ్మానందం, ప్రధాన కార్యదర్శి వెంకన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు జాఫర్, నర్సన్న, చందు, మహేశ్, శోభ తదితరులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

రామకృష్ణాపూర్: ఈ నెల 29న భద్రాది కొత్తగూడెంలో నిర్వహించనున్న సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ 7వ మహాసభల పోస్టర్లను బుధవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై సభల్లో చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం, గజ్జి మల్లేశ్, నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ జాఫర్ పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో బుధవారం మహాసభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. సంఘం నాయకులు సుందర్, రాజేశ్వరి, శంకర్, పద్మ తదితరులు ఉన్నారు.

'వేతన సాధనలో జాతీయ సంఘాలు విఫలం'

శ్రీరాంపూర్: 11వ వేతన ఒప్పంద సాధనలో జాతీయ సంఘాలు పూర్తిగా విఫలం అయ్యాయని గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి ఆరోపించారు. ఆర్కే 7గనిపై బుధవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడారు. 24శాతం కంటే తక్కువ కాకుండా వేతనాలు పెంచుకు వస్తామని బొగ్గు గనులపై ప్రగల్భాలు పలికిన జాతీయ సంఘాల నాయకులు అందుకు భిన్నంగా కేవలం 19శాతంకే ఒప్పందం చేసుకొని కార్మికవర్గానికి అన్యాయం చేశారన్నారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. వేతన ఒప్పందాన్ని సాధించడంలో చేతకాని సంఘాలు తాము హక్కులు సాధిస్తుంటే మాత్రం విమర్శించడం వారు దిగ జారుడుతనానికి నిదర్శనం అన్నారు. 16శాతం లాభాల వాటాను తమ హయాంలో 30శాతంకు పెంచి ఇప్పించామన్నారు. పీఎంఈకి మస్టర్ పోగొట్టితే తాము తిరిగి ఇప్పించామన్నారు. కార్మికుల ప్రధాన హక్కు అయిన వారసత్వ ఉద్యోగాలు పోగొట్టితే తాము కారుణ్య ఉద్యోగాల రూపంలో ఇప్పిస్తున్నామన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా హక్కులు సాధించింది ఒక్క టీబీజీకేఎస్ మాత్రమే అన్నారు. సమావేశంలో ఆ యూనియన్ కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి, జీఎం చర్చల ప్రతినిధి పెట్టం లక్ష్మణ్, వెంగళ కుమారస్వామి, ఫిట్ సెక్రెటరీ మెండె వెంకటి, నాయకులు ల్యాగల శ్రీనివాస్, అశోక్, చిలువేరు సదానందం, తొంగల రమేశ్, బస్సు రమేశ్, ప్రేంకుమార్, రాజునాయక్, సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

సీఎంపీఎఫ్ చీటీలు పంపిణీ చేయాలి

మందమర్రిరూరల్: సింగరేణిలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే సీఎంపీఎఫ్ చీటీలు పంపిణీ చేయాలని డిమాడ్ చేస్తూ ఏరియా జీఎం ఆఫీస్ ఎదుట బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టగా, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం జీఎం ఆఫీస్ హెచ్‌వోడీ శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాలుగా సీఎంపీఎఫ్ చీటీలు ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. వెంటనే పంపిణీ చేయకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

అటెన్షన్ ప్లీజ్.. నిరుపయోగంగా చేతిపంపు



చెన్నూర్‌రూరల్: మండలంలోని అక్కెపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట ఉన్న చేతిపంపు పని చేయకుండా నిరుపయోగంగా మారింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని చేతిపంపునకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

సంబంధిత అధికారి: సరిత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

బడికెట్ల పోవాలె!



బస్సు కోసం వేచి చూస్తున్న విద్యార్థులు

ఖమ్మంలో జరిగిన బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభకు జిల్లాల నుంచి ఆర్టీసీ బస్సులను తరలించారు. దీంతో సంక్రాంతి సెలవుల తర్వాత బుధవారం తెరుచుకున్న పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడ్డారు. మంచిర్యాల చున్నంబట్టివాడ, తోళ్లవాగులో ఉండే విద్యార్థులు రాజీవ్‌నగర్‌లోని మోడల్ స్కూల్‌కు వెళ్లేందుకు బస్సు కోసం ఎదురు చూశారు. సమయం దాటి పోవడంతో ఇక బస్సు రాదని ఇళ్లకు వెళ్లిపోయారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, మంచిర్యాల



బస్సు రాకపోవడంతో తిరిగి ఇంటికి వెళ్లిపోతున్న విద్యార్థులు